అడ్డగోలుగా చేపల చెరువులు

- కొత్తచెరువు కింద 200 ఎకరాల ఆయకట్టు
- అనధికారికంగా 62 ఎకరాల్లో చేపల సాగు
- ఏటా దెబ్బతింటున్న 70 ఎకరాల్లోని వరిపంట
- సమస్యను పరిష్కరించాలని నాలుగేళ్లుగా బాధిత రైతుల విజ్ఞప్తి
- అయినా పట్టించుకోని అధికారులు


పాచిపోయిన వరి నాట్లను చూపుతున్న బాధిత రైతులు

ఆత్మకూరు: ఏటా రెండు పంటలు పండే భూముల్లో అడ్డగోలుగా చేపలను సాగుచేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్‌ను వాడుకుంటూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. సాగునీటి కాలువల నీటిని గుట్టుగా తరలించి వాడుకుంటున్నారు. చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలను వినియోగిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. పచ్చటి పొలాల మధ్యన అనధికారికంగా సాగు చేస్తున్న చేపల చెరువులపై చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులు చోద్యం చూస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేజర్ల మండలంలోని పెన్నాతీర గ్రామమైన కోటితీర్థంలోని కొత్తచెరువు కింద సుమారు 200 ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో ఏటా రెండు పంటలు పండుతూ పొలాలు పచ్చగా కళకళలాడేవి. గత నాలుగేళ్లుగా పొలాల మధ్యన అనధికారికంగా చేపలను సాగుచేస్తుండడంతో పచ్చటి పొలాలు కళతప్పాయి. గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ స్వార్థంతో కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వారికి చేపల సాగుకు లీజుకు ఇచ్చారు. దీంతో వారు అనధికారికంగా చెరువులను ఏర్పాటు చేయడంతో సమీపంలోని సన్న, చిన్నకారు రైతుల పొలాలు ఊటెక్కి మోకాటి లోతు నీరు నిలిచిపోతోంది. దీంతో వరి నాట్లు వేసే పరిస్థితి ఉండడం లేదు. వారి నాట్లు వేసినా పాచిపోతున్నాయని రైతులు కన్నీటిపర్యాంతం అవుతున్నారు.

దేవదాయశాఖ భూముల్లో సైతం..

కోటితీర్థంలోని పురాతన కామాక్షి సమేత కోటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి కొత్తచెరువు ఆయకట్టు కింద నాలుగు ఎకరాలు మాన్యం ఉంది. ఈ భూములు సైతం మునకకు గురవడంతో వేలంలో దక్కించుకున్న రైతు ఆవేదన చెందుతున్నాడు. వేలంలో రూ.42వేలకు దక్కించుకున్నానని, ముంపుతో వరినాట్లు వేయలేక బీడుగా వదిలేశానని, అయినా దేవస్థానం వారు ఒప్పుకోకపోవడంతో నగదు చెల్లించాల్సి వచ్చిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

తూములు, కాలువలు పూడ్చివేత

కొత్త చెరువు పరిధిలోని పొలాల్లోని వరద నీరు గంగిరెడ్డి కాలువ ద్వారా బయటకు వెళ్తుంది. అయితే కాలువలోకి వెళ్లే చీలుకాలువలను చేపల చెరువుల రైతులు పూడ్చేశారు. దీనికితోడు గంగిరెడ్డికాలువలో పూడికతీత చేపట్టకపోవడంతో జమ్ముపెరిగిపోయింది. చెరువు కాలువను సైతం చేపలగుంతల రైతులు పూడ్చివేయడంతో పంట పొలాల్లో నీరు నిలిచిపోతోంది. చెరువు అలుగు నీరు పోయే తూమును పూడ్చివేయడంతో పొలాల్లోకి వస్తున్నాయి. దీనికి తోడు చేపలగుంతలు పక్కనే ఉండడంతో పొలాలు ఊటెక్కి చెరువుల్లా మారిపోయాయి. ముంపు సమస్యను ఎదుర్కొంటున్న చిన్న, సన్నకారు రైతులు చేపల చెరువులు సాగు చేస్తున్న వారిని ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు దిగుతున్నారు. వరి నాట్లు వేసుకోకపోతే బీడు పెట్టుకోమని హేళన చేస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు.


నూతనంగా ఏర్పాటు చేసిన చేపల గుంత

కలెక్టర్‌కు తొమ్మిది సార్లు అర్జీ

కొత్తపల్లి చెరువు ఆయకట్టు కింద దివంగత ఆదర్శ రైతు కొమ్మి సింగయ్య భార్య విజయమ్మ తన ఏడెకరాల భూమి అనధికారికంగా సాగుచేస్తున్న చేపల చెరువుల కారణంగా ముంపునకు గురవడంతో సమస్యను పరిష్కరించాలని మండలాధికారులకు పలుమార్లు మొరపెట్టుకుంది. వారు పట్టించుకోకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. కలెక్టరేట్‌లో ప్రతిసోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తొమ్మిది సార్లు అర్జీలు ఇవ్వగా ఎట్టకేలకు కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో ఆర్డీఓ, ఫిషరీస్, ఇరిగేషన్ అధికారులతో కూడిన త్రీమెన్ కమిటీ గత శుక్రవారం అనధికారికంగా సాగు చేస్తున్న చేపల చెరువులను పరిశీలించారు.


చేపల చెరువుల నీటితో ముంపునకు గురై దెబ్బతిన్న పంట పొలాలు

చేపల గుంతలతో పొలాలు కలుషితం



నా భర్త సింగయ్య నాణ్యమైన ధాన్యాన్ని పండించేవారు. వ్యవసాయాధికారులు గుర్తించి మూడుసార్లు ఆదర్శ రైతుగా అవార్డులు అందజేశారు. తమ పచ్చటి పొలాలు చేపల గుంతలతో కలుషితమై పంట పండడం లేదు. అక్రమంగా చేపల సాగుపై కలెక్టరేట్‌కు తొమ్మిదిసార్లు వెళ్లి అర్జీలు ఇస్తే రెండ్రోజుల క్రితం అధికారులు పరిశీలించేందుకు వచ్చారు. కలెక్టర్ స్పందించి పొలాల మధ్యన అనధికారికంగా చేపలు సాగుచేస్తున్న వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

– కొమ్మి విజయమ్మ

జీవాలు అమ్మి పొలం కొన్నాం



గతంలో జీవాలను మేపుకొంటూ జీవనం సాగించే వాళ్లం. కొత్తచెరువు కింద పొలం అమ్మకానికి వస్తే జీవాలను అమ్మి మూడున్నర ఎకరాలను కొనుక్కున్నాం. రెండేళ్లు ధాన్యం పండించాం. గత రెండేళ్లుగా చేపల సాగుతో పొలం మునిగిపోయి నాట్లు వేయలేకపోతున్నాం.

– జీ శ్రీనివాసులు, కొండమ్మ

కూలీలుగా మారాం



కొత్తచెరువు కింద మాకున్న ఎకరా పొలంలో వరి పంట సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. రెండేళ్లుగా చేపల గుంతలు రావడంతో మా పరిస్థితి తలకిందులైంది. ఏటా నాటిన పంట దెబ్బతింటోంది. దీంతో కుటుంబ పోషణ కోసం కూలీ పనులకు వెళ్తున్నాం.

–కోటేశ్వరరావు, లక్ష్మీదేవి

క్లుప్తంగా

ఏడీఎంహెచ్ఓ తనిఖీలు



అనుమసముద్రంపేట: పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ వైద్యసిబ్బందికి సూచించారు. ఏఎస్‌పేట పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ల్యాబ్‌లో రక్త పరీక్షలపై ఆరాతీశారు. వైద్యపరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిఒక్కరూ ఇక్కడే చేయించుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి వినూత, సిబ్బంది ఉన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



మర్రిపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదును సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఏపీటీఎఫ్ ముందుంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏటీపీఎఫ్ బాధ్యులు బీ వెంకటేశ్వరరాజు, ఎం శ్రీనివాసులరెడ్డి, కే పెంచలయ్య, ఎస్ వెంకటేశ్వర్లు, షేక్ కరీంమొహిద్దీన్, నాగరాజు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం



ఉదయగిరి: సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం మెంటార్ పీ సుధారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సేంద్రియ కూరగాయల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు చెందిన రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఇతర ఉత్పత్తులను స్టాల్‌లో అందుబాటులో ఉంచారు. ఉద్యోగులతో పాటు వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన వ్యక్తులు కొనుగోలు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ముజ్జి మహాలక్ష్మి, ఆర్ అంకబాబు, డి.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ తనిఖీలు



ఉదయగిరి రూరల్: పట్టణంలోని దళితవాడ ఆదర్శ పాఠశాలను ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. బోధన అభ్యసన సామగ్రితో విద్యార్థులకు బోధన చేయాలని, సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం షబ్బీర్ ఉన్నారు.

గంబూషియా చేప పిల్లల విడుదల


ఉదయగిరి: చేపలను వదులుతున్న డాక్టర్

ఉదయగిరి : స్థానిక ట్యాంక్‌బండ్‌లోని నీటిలో దోమల నివారణకు గంబూషియా చేప పిల్లలను వైద్యారోగ్య సిబ్బంది సోమవారం విడుదల చేశారు. ఉదయగిరి సబ్‌యూనిట్ పరిధిలోని ఉదయగిరి, వెంకటాపురం, బ్రాహ్మణపల్లి, సింగనపల్లి, తదితర ప్రాంతాల్లోని నీటి వనరుల్లో చేప పిల్లలను వదిలినట్టు వారు తెలిపారు. వైద్యులు శివకల్యన, నౌషద్‌బాబు పాల్గొన్నారు.

ఆత్మకూరు: జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా మహిమలూరులో పీహెచ్‌సీ వైద్యాధికారి పీజే దేవానంద్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని నీటి వనరుల్లో గంబూషియా చేపపిల్లలను వదిలారు.

చెరువుమట్టి తరలింపును నిలిపివేయాలని వినతి

ఆత్మకూరు: ఆత్మకూరు మేజర్ చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలించి ఓ కళాశాలలోని ఖాళీ స్థలంలో నింపుతున్నారని, మట్టి అక్రమ తరలింపును నిలిపివేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు రైతులతో కలిసి ఆర్డీఓ బీ పావనికి సోమవారం వినతి పత్రం అందజేశారు.

హత్య కేసు నిందితుల కోసం ముమ్మర గాలింపు

- సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా పట్టుకునేందుకు పోలీసుల యత్నాలు
- రెండ్రోజుల్లో లొంగిపోయే అవకాశం?

ఉదయగిరి: పట్టణంలో మూడు రోజుల క్రితం ఆస్తి వివాదం నేపథ్యంలో షేక్ మహ్మద్ హమీద్‌ను కిరాతకంగా హత్య చేసి పరారైన గుంటుపల్లి ఉమర్ అలీ, హనీఫ్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. వింజమూరు, కలిగిరి, వరికుంటపాడు ఎస్సైల ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందాలు నిందితుల కోసం వేట సాగిస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న పలువురు యువకులను పోలీసులు సోమవారం ఉదయగిరి స్టేషన్‌కు పిలిపించి విచారించి వారి వాంగ్మూలాలను రికార్డు చేశారు. హత్య దృశ్యాలను సెల్‌లో చిత్రీకరించడం..ఆ దృశ్యాలు వైరల్ కావడంతో భయపడి పరారీలో ఉన్న ఆరీఫ్ స్టేషన్‌కు స్వయంగా వచ్చి పోలీసులకు వివరాలు తెలిపారు. సదరు యువకుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులను పోలీసులు ఇబ్బంది పెడుతున్నారంటూ ఆదివారం రాత్రి బంధువులు ఆందోళన చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం యువకుడు స్టేషన్‌కు వచ్చారు. హత్యను చిత్రీకరిస్తుండడాన్ని నిందితులు చూశారని, హత్యానంతరం తనపై దాడికి చేసేందుకు ప్రయత్నించగా వారి నుంచి తప్పించుకుని భయపడి వేరే చోటుకు వెళ్లి తల దాచుకున్నట్లు పోలీసులకు తెలిపారు.

పోలీసుల వైఫల్యం ఉందా?

ఈ నెల 11న సాయంత్రం 6.55 గం సమయంలో హత్య జరిగింది. కేవలం ఐదు నిమిషాలలోపే పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై ఆళ్ల శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికి కొద్ది నిమిషాల ముందే నిందితులు పరారయ్యారు. నిందితులు ఎవరు అనేది ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. వెంటనే పోలీసులు అన్నీ స్టేషన్లను అప్రమత్తం చేసి ఉంటే ఖచ్చితంగా నిందితులు దొరికేవారనే వాదనలు ఉన్నాయి. హత్య చేసిన తరువాత నిందితులు తమ వద్ద ఉన్న స్కూటీపై గోదాము వరకు వెళ్లి అక్కడి నుంచి కారులో పరారయ్యారు. వారు గండిపాళెం రోడ్డులో పామూరు చేరుకున్నట్లుగా తెలుస్తోంది. పోలీసులు వెంటనే అప్రమత్తమై ఉంటే సిగ్నల్స్ ఆధారంగా నిందితులను పట్టుకునే అవకాశం ఉండేదని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే హత్య జరిగిన వెంటనే తాము ఇతర స్టేషన్ల పోలీసులను అప్రమత్తం చేశామని, అయినా ఫలితం లేదని పోలీసులు చెబుతున్నారు. నిందితుల ఆచూకీ దాదాపు పోలీసులకు అందుబాటులో ఉన్నట్లుగా తెలుస్తోంది. నిందితులను పోలీసులకు అప్పగించేందుకు వారి సమీప బంధువు పోలీసుల అధికారులతో సంప్రదింపులు కూడా జరుపుతున్నట్లు విశ్వశనీయంగా తెలిసింది. రెండ్రోజుల లోపే నిందితులు పోలీసుల కస్టడీలోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. వారిని విచారిస్తే కేసులో ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా? ఉంటే ఎవరూ ఉన్నారు.. అనే సమాచారం తెలిసే అవకాశం ఉంది.

గ్రావెల్ అక్రమ తరలింపుపై జరిమానా

వరికుంటపాడు: మండలంలోని జీ కొండారెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని జీ కొత్తపల్లి చెరువు నుంచి ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా ఆదివారం గ్రావెల్‌ను అక్రమంగా తరలించారు. ఈ విషయమై సోమవారం మీడియాలో కథనాలు రావడంతో ఇరిగేషన్ ఏఈ ఆదిరమేష్ చెరువును పరిశీలించారు.గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని కొలతలు తీసి 98 క్యూబిక్ మీటర్లు తరలించినట్లు గుర్తించారు. గ్రావెల్ తరలించిన వ్యక్తికి రూ.10వేలు జరిమానా విధించారు. ఆయన వెంట మరో ఏఈ వెంకట్రావు ఉన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా పీ భువనేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో (డీపీఓ) సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై ఆత్మకూరు డిప్యూటీ ఎంపీడీఓగా వచ్చారు. ఆమె ఎంపీడీఓ రఫీఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉపాధి పనులు కల్పించకపోవడంపై కూలీల ఆగ్రహం


ఎంపీడీఓను నిలదీస్తున్న కూలీలు

ఉదయగిరి : కుర్రపల్లి బీసీ కాలనీలో రాజకీయంతో ముడిపెడుతూ మూడు నెలలుగా ఉపాధి పనులు కల్పించకపోవడంపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గ్రామంలోని ఓ టీడీపీ గ్రూపునకు చెందిన వారు చెప్పినట్లుగా వింటూ ఇతర కూలీలకు అన్యాయం చేస్తారని ఎంపీడీఓ అప్పాజీని నిలదీశారు. ఉద్యోగం చేస్తారా లేక రాజకీయం చేస్తారా అంటూ ఎంపీడీఓపై విరుచకుపడ్డారు. ఉపాధి సిబ్బందిని ఎన్నిసార్లు అడిగినా పనులు చూపకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులు కల్పించకపోతే ఎంపీడీఓపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం గుర్తింపు


యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కలిగిరి: మండలంలోని నాగిరెడ్డిపాళెం సెంటర్ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న పెట్రోల్ బంకు వద్ద వీర్నకొల్లు పొలాల్లో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని సోమవారం రైతులు గుర్తించారు. కలిగిరి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ఎం ఉమాశంకర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్యన వయస్సు ఉండొచ్చు. కుడి చేతిపై సత్యవతి, సింహం బొమ్మవేసి వంశీ, కళ్యాణి అని తెలుగులో రాసిన పచ్చబొట్లు ఉన్నాయి. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. కాగా ఆదివారం యువకుడు అతిగా మద్యం సేవించి నాగిరెడ్డిపాళెం సెంటర్‌లో తిరిగినట్లుగా స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతిగా మద్యం సేవించడం వల్ల దప్పికతో గొంతు తడి ఆరిపోయి యువకుడు మరణించి ఉండొచ్చని భావిస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440700098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

దుకాణాల్లో పనిచేసే కార్మికులకు గుర్తింపు కార్డులు



ఉదయగిరి : పట్టణంలోని దుకాణాలను గూడూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షేక్ గౌస్‌బాషా సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికుల వివరాలను సేకరించారు. కార్మికులకు గుర్తింపు కార్డులను ఇచ్చేందుకు ఆధార్ కార్డులు, వయస్సు ధ్రువీకరణ పత్రాలు, ఫోన్ నంబర్లు తీసుకున్నారు. కార్మికులకు ప్రభుత్వం కల్పించే వివిధ రకాల ప్రయోజనాలు అందించేందుకు గుర్తింపు కార్డులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీపై సమావేశం నేడు

బిట్రగుంట: బోగోలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ'పై మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేయడంపై ఉదయం 9.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

గరిమెళ్లకు నివాళి



సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గేయాలు రాసి జైలు శిక్ష అనుభవించిన మొదటికవి గరిమెళ్ల అని తెలిపారు. ఆయన రాసిన మాకొద్దీ తెల్ల దొరతనం గేయం సామాన్య ప్రజల్లో కూడా స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షను రగిలించిందన్నారు. ఉపాధ్యాయులు మహేష్, ధనుంజయ, రమణరాజు, మదీనా, మాధవి, నాగమురళి, పెద్దయ్య పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రిని తరలించాలని వినతి

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదాన ఆవరణంలోని గదుల్లో నిల్వ చేసి ఉన్న గత ఎన్నికలకు సంబంధించిన సామగ్రిని వేరే చోటుకు తరలించాలని హెచ్‌ఎం షరీఫ్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎల్ రామ్మోహన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల సామగ్రిని తరలిస్తే విద్యార్థులకు అవస్థ తప్పుతుందన్నారు. స్పందించిన తహసీల్దార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని తెలిపారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

సంగం: చెరువులో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వంగల్లులో చోటు చేసుకుంది. వివరాలు.. వంగల్లు గ్రామానికి చెందిన పీ శ్రీనివాసులు(50), అరుణమ్మ దంపతులు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. శ్రీనివాసులు వ్యవసాయ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని భార్యకు చెప్పి ఇంటి నుంచి వచ్చాడు. అర్ధరాత్రి అయిన తిరిగి రాకపోవడంతో భార్య, బంధువులు అన్నిచోట్ల వెతికారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం శ్రీనివాసులు చెరువులో శవమై కనిపించాడు. బహిర్భూమికి వెళ్లి కాలి జారిపడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు మృతదేహాన్ని సంగం పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు



జలదంకి: మండల పరిధిలోని 167 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై లతీఫున్నీసా తెలిపారు. మండలంలోని తొమ్మిదోమైలు వద్ద హైవేపై బ్యారికేడ్లను పోలీసులు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపొద్దని సూచించారు.

విద్యాసామగ్రి వితరణ

ఉదయగిరి రూరల్: మండలంలోని జీ అయ్యవారిపల్లె ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సోమవారం విద్యాసామగ్రిని వితరణ చేశారు. హెచ్‌ఎం బాబు చేతుల మీదుగా విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులు, డ్రాయింగ్ పుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. విద్యార్థులకు విద్యాసామగ్రిని వితరణ చేసిన పూర్వ విద్యార్థులను అభినందించారు.



కిలో పొగాకు సగటు ధర రూ.211

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు సగటు ధర రూ.211.64 లభించింది. వేలానికి 787 బేళ్లు రాగా, 689 బేళ్లను విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.211.64 ధర పలికిందని వివరించారు.

కలిగిరిలో 537 బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 537 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు వేలానికి 588 బేళ్లను తీసుకురాగా, 537 పొగాకు బేళ్లను విక్రయించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ. 214.40 ధర పలికిందని వివరించారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చిన కార్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇకపై తాను ప్రభుత్వ కార్యాలయాలను తరచూ తనిఖీ చేస్తానని, పనితీరు మెరుగుపడకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అనధికార లేఅవుట్లపై కొరడా



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అనధికార లేఅవుట్లపై టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం నెల్లూరు–ముంబై జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న అనుమతులు లేని లేఅవుట్లలోని రోడ్లు, డ్రైయిన్లు, హద్దురాళ్లను జేసీబీతో ధ్వంసం చేశారు. కాగా కొన్ని లేఅవుట్లకు నుడా అప్రూవల్ ఉందని, ఒక్క భవనానికి అనుమతి ఇచ్చినా అందులో గృహాలు కట్టుకునేందుకు అనుమతులు ఉంటాయని ప్లాట్ల యజమానులు వాదిస్తున్నారు. ఈ విషయమై యజమానులు, అధికారుల నడుమ కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా మున్సిపల్ పరిధిలోని 16 లేఅవుట్లలో ఇప్పటి వరకు ఆరు లేఅవుట్లను తొలగించామని, మిగిలిన వాటిని మరో రెండ్రోజుల్లో తొలగిస్తామని అధికారులు తెలిపారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు

జలదంకి: ఓటర్ల నమోదును పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ ప్రమీల అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బీఎల్వోలకు సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. కొత్త ఓటర్లను నమోదు చేసే సమయంలో ప్రత్యక్షంగా కుటుంబాన్ని పరిశీలించాలని, వివరాలు సక్రమంగా ఉంటేనే నమోదు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నష్టపరిహారం కోసం వినతి

సీతారామపురం : జాతీయ రహదారి నిర్మాణం కోసం సేకరించిన తమ బావికి నష్టపరిహారం అందించాలని గుండుపల్లె వాసులు కోరారు. ఈ మేరకు సర్పంచ్ చప్పిడి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు.